క్లుప్తంగా

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించండి


రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ వెంకట్రాముడు

గుత్తి రూరల్: భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో ఏఓ మెహరున్నీసా బేగంతో కలసి ఏడీఏ పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించి, రైతులకు పలు సూచనిచ్చారు 30 నుంచి 40 రోజుల వేరుశనగ పంటలకు ఎకరాకు 200 కిలోల జిప్సం వేయాలన్నారు. 30 మంది రైతులకు వేరుశనగలో ఆర్గానిక్ సర్టిఫికెట్ వచ్చేలా శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణ భగవాన్, వీహెచ్ఏ అజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకం లాభదాయకం


కోళ్లను పంపిణీ చేస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: రైతులకు వ్యవసాయంతో పాటు పెరటి కోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి కేవీకేలో ఎస్సీ రైతులకు ఐదు రోజుల పాటు పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులకు కోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం కోడి మాసం, గుడ్లకు మార్కెట్‌లో డిమాండ్ ఉందన్నారు. అనంతరం పెరటి కోళ్ల పెంపకం, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా 25 మంది రైతులకు పెరటి కోళ్లను అందజేశారు. కార్యక్రమంలో కేవీకే వెటర్నీ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త చందన, నిత్రా-వైపీ-2 ప్రతినిధి ప్రభుమిత్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అనుమతి లేని రీచ్‌లు సీజ్ చేయండి


నందలపాడులోని ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: అనుమతులు లేని ఇసుక రీచ్‌లను వెంటనే సీజ్ చేయాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మైనింగ్, మున్సిపల్ అధికారులు, పోలీసులను ఆదేశించారు. శుక్రవారం నందలపాడులోని ఇసుక రీచ్‌లను ఆయన పరిశీలించారు. అక్కడ కొందరు అక్రమార్కులు అనుమతులు లేకుండా ఇసుక రీచ్ నిర్వహిస్తున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే.. అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌ను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మైనార్టీ కస్తూరిబా పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. అనంతరం తన నివాసయంలో ఆర్ అండ్‌బీ అధికారులతో సమావేశమై నియోజకవర్గంలోని రోడ్ల పరిస్థితిపై సమీక్షించారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని మానవతా రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఆలూరు సాంబశివారెడ్డి తండ్రి సుంకిరెడ్డి వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ సొసైటీ, మానవతా సంస్థ సంయుక్తంగా రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరూ తన సంపాదనలో కొంత నిరుపేదలకు, సామాజిక సేవా కార్యక్రమాల కోసం ఖర్చు చేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో 115 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఐక్యూఏసీ కన్వీనర్ సాయి చైతన్య కిషోర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత చిన్న పుల్లయ్య పాల్గొన్నారు.

ఆగని తమ్ముళ్ల ఇసుక దందా

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన గ్రామస్తులు
- రెండు టిప్పర్లను పట్టుకున్న పోలీసులు

శింగనమల: మండలంలో టీడీపీ నాయకుల ఇసుక అక్రమ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. మండలంలోని ఇరువెందల సమీపంలోని నదీ పరివాహక ప్రాంతంలో కొందరు టీడీపీ నాయకులు జేసీబీ పెట్టి, టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు... వాహనాలను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినా వారిలో మార్పు రాలేదు. దీంతో స్థానికులు నేరుగా ఫోన్ ద్వారా ఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున రంగంలో దిగి రెండు టిప్పర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

కార్యకర్తలకు అండగా ఉంటాం

గుంతకల్లు రూరల్: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. మండలంలోని కసాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతు రులు కురుబ నీలకంఠ, సంజీవ్‌లపై గతనెల 31న అదే గ్రామానికి చెందిన అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి చేసిన విషయం విదితమే. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితు లు ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే శుక్రవారం కసాపురం గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం మాని, అధికార బలంతో దాడులకు తెగబడుతున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలో దాడులు పెరిగాయని, ఇలాంటి విష సంస్కృతికి పాల్పడితే రానున్న రోజుల్లో ప్రజలే తగిన రీతిలో బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, మాజీ ఎంపీటీసీ వెంకటరాముడు, సోమిరెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


దాడిలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

శిలాఫలకంపై దాడి హేయం

గుంతకల్లుటౌన్: విజయవాడలోని స్వరాజ్ మైదానంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పానికి సంబంధించిన శిలాఫలకంపై దాడి చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శులు జి.బావన్న, బి.ముని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.400 కోట్లతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి జాతికి అంకితం చేస్తే ఓర్చుకోలేని టీడీపీ అల్లరి మూకలు శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని వారు ఖండించారు. తిరిగి వైఎస్.జగన్ పేరును విగ్రహ శిలాఫలకంపై ఏర్పాటు చేసి, విజయవాడ నడిబొడ్డున రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విగ్రహ పరిరక్షణకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో 14, 36వ వార్డు ఇన్‌చార్జ్‌లు వీరేష్, పరుశురాముడు, ఎస్సీసెల్ నాయకులు ఆంజనేయులు, లాలెప్ప, నర్సప్ప, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి బావన్న

కార్పొరేట్ నుంచి వ్యవసాయాన్ని కాపాడాలి


తాడిపత్రిలో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు


గార్లదిన్నెలో ర్యాలీ చేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడిపత్రి అర్బన్: ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక మహాత్మాగాంధీ సర్కిల్‌లో క్విట్ కార్పొరేట్ పేరుతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. రైతు సంఘం కార్యదర్శి రాజారామిరెడ్డి మాట్లాడుతూ సంపదను లూటీ చేస్తున్న బడా కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు శిరీష, నాయకులు జయశేఖర్, పాపయ్య, అంకిరెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు చివరి వరకూ సాగునీరందించాలి

గార్లదిన్నె: ప్రభుత్వం ఆయకట్టు చివరి వరకూ సాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం నాయకులు క్విట్ ఇండియా డే సందర్భంగా గార్లదిన్నెలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మండల అధ్యక్షలు చెన్నారెడ్డి, రాముడు, నల్లప్ప పాల్గొన్నారు.

ఆనర్స్ కోర్సులకు అనుమతి

గుంతకల్లు రూరల్: స్థానిక శంకరానందగిరీ డిగ్రీ కళాశాలలో నాలుగో సంవత్సరం ఆనర్స్ కోర్సులకు అనుమతి లభించినట్లు కరస్పాండెంట్ కేసీ హరి, ప్రిన్సిపాల్ గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగో సంవత్సరం డిగ్రీ ఆనర్స్ కోర్సులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, అనంతపురం ఎస్కే యూనివర్శిటీ అనుమతులు మంజూరు చేసిందన్నారు. బీఎస్సీ కంప్యూటర్స్, బీఎస్సీ బయోటెక్నాలజీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీబీఏ కోర్సుల్లో నాలుగు సంవత్సరాల డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీలోని సుంకులమ్మ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. పౌష్టికాహార పంపిణీపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణకుమారి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో శుక్రవారం మహిళలు నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుత్తిలోని తాడిపత్రి రోడ్డు, చెరువు కట్ట, గాంధీ నగర్, కాల్వ గడ్డ ఆంజనేయస్వామి రోడ్డు, కోట, ఆర్ఎస్‌లోని గౌతమేశ్వరాలయం, పత్తి కొండ రోడ్డు తదితర ప్రాంతాల్లోని నాగుల కట్టలకు ప్రత్యేక పూజలు చేశారు. పాముల పుట్టల్లోకి పాలు పోశారు. నాగులకట్టల వద్ద ఎక్కడా చూసినా కోలాహలం కనిపించింది.

భూ సమస్యలు పరిష్కరించండి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు పరిష్కరించాలని దళిత సంఘం నాయకులు కోరారు. శుక్రవారం తహసీల్దార్ ఈరమ్మను దళిత సంఘాల నాయకులు కలసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల భూసమస్యలు తన దృష్టికి వస్తే, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ చైర్మన్ రవిరాజ్, నాయులు జయరాజ్, కదిరెప్ప, నాగేంద్ర, గోపాల్, ఆదెన్న, ఓబులపతి, నరసింహులు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు కలసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, గార్లదిన్నె ఎంపీటీసీ రామచంద్ర, మాజీ ఎంపీటీసీ గట్టు రామక్రిష్ణారెడ్డి, డ్యాం సర్పంచు ఉషారాణి, తిమ్మంపేట ఎంపీటీసీ గీతాభవానీ, రామచంద్రారెడ్డి, పుల్లారెడ్డి, కేశవాపురం సర్పంచు రామాంజనేయులు, మర్తాడు ఎంపీటీసీ తిమ్మారెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

1న చెగువేరా మెమోరియల్ చెస్ పోటీలు

గుంతకల్లు: చెగువేరా మెమోరియల్ చదరంగం పోటీలు సెప్టెంబర్ 1న నిర్వహించనున్నట్లు మాస్టర్ చెస్ అకాడమీ సభ్యుడు అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆయనతోపాటు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి బి.మహేష్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 1న సీపీఐ కార్యాలయంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనే వారు 9625772763 నంబరుకు ఫోన్ చేసి పేరు రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. సీపీఐ నాయకులు ఎస్ఎండీ గౌస్, ఈశ్వరయ్య, ప్రసాద్, పుల్లయ్య పాల్గొన్నారు.

శుద్ధి చేసిన నీటిని తాగాలి

గార్లదిన్నె: ప్రజలు శుద్ధి చేసిన నీటిని తాగాలని గార్లదిన్నె పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి సూచించారు. శుక్రవారం గార్లదిన్నె పీహెచ్‌సీలో జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నడవటానికి ఇబ్బంది ఉన్న 12 మందికి వాకర్ స్టాండ్, 47 మందికి వాకర్ స్టిక్స్, మెడ కండరాలు సమస్య ఉన్న 13 మందికి మెడ బెల్ట్, నడుము నొప్పి ఉన్న 20 మందికి లంబార్ బెల్ట్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లోక్‌నాథ్, ఏఎన్ఎం సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుంతకల్లు రూరల్: గుంతకల్లు మార్కెట్ యార్డు, ఇండస్ట్రియల్ ఏరియా, ఆలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పట్టణంలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ రంగస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన సూచించారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదినం

గుత్తి: పట్టణంలోని కొత్తూరులో ఉన్న అనాథాశ్రమంలో శుక్రవారం హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలను ఆయన అభిమాన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మహేష్ బాబు అభిమాన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, మర్తాడు దాదా ఖలందర్, ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా(జీవు బాషా), ఓంకార్, సహాయ కార్యదర్శి కందుల చంద్ర తదితరులు ఆధ్వర్యంలో అనాథ పిల్లలు, మహిళలకు అల్పాహారం అందజేశారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 9వ వార్డులో డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణ పనులను కమిషనర్ వెంకటరమణయ్య శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అంతకుముందు కంపోస్టుయార్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈ గురప్పయాదవ్, ఏసీపీ సత్తార్, టీపీఎస్ మురళి పాల్గొన్నారు.

ఎల్ఐసీ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తాడిపత్రి టౌన్: ఎల్ఐసీ సేవలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని బ్రాంచి మేనేజర్ రాజశేఖర్ సూచించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం జీవన్ అక్షయ్ పాలసీ కింద రూ.50 లక్షల సింగిల్ డిపాజిట్ చేసిన ఏజెంట్ కుమారస్వామి, సహకరించిన డెవలప్‌మెంట్ మేనేజర్ జీవన్ కుమార్‌ను మేనేజర్, ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పుట్లూరు: మండలంలోని సూరేపల్లిలో జూద కేంద్రంపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.2050 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కూలీ మృతి

తాడిపత్రి రూరల్: పట్టణ సరిహద్దులోని కడప స్లాబ్ యూనిట్‌లో కూలీగా పనిచేస్తున్న కంబగిరి(38) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని అప్‌గ్రేడ్ రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు..గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన కంబగిరి ఉపాధి కోసం కుటుంబ సభ్యులతో తాడిపత్రికి వలస వచ్చి కడప స్లాబ్ యూనిట్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. సమీపంలోని చుక్కలూరు గ్రామంలో ఉంటున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. వ్యక్తిగత కారణాలతో ఈనెల 5న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురానికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

కూలీ ఆత్మహత్య

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో బోయ వ్యవసాయ కూలీ రామాంజనేయులు(35) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు స్థలం వద్దకు చేరుకుని కొన ఊపిరితో ఉన్న రామాంజనేయులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతడికి భార్య చంద్రకళ, కుమారుడు, కూతరు ఉన్నారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని వడ్లపాలెంలో నివాసముంటున్న జింకా శ్రీనివాసులు(28) మానసిక వ్యాధితో బాధపడుతుండేవాడు. తల్లిదండ్రులు చనిపోవడంతో మామ ఇంట్లో ఉండేవాడు. వివాహం కాకపోవడంతో మనస్థాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్య, వైద్యం, నీటికి ప్రాధాన్యత

గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గంలో విద్య, వైద్యం, నీటికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, అందుకు అనుగుణంగా మండల స్థాయి అధికారులంతా సమన్వయంతో పని చేయాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే హాజరై సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండి, చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. మిడ్‌పెన్నార్ డ్యాం గేట్లకు మరమ్మతు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని హెచ్చెల్సీ అధికారులకు సూచించారు. మూడేళ్లుగా రెగ్యులర్ విద్యుత్ శాఖ ఏఈ లేకపోవడంతో రైతులు, ప్రజలకు ఇబ్బందిగా ఉందని గార్లదిన్నె ఎంపీటీసీ రామచంద్ర, డ్యాం సర్పంచ్ ఉషారాణి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. యర్రగుంట్లలో నూతన పీహెచ్‌సీకి స్థలం చూపాలని వైద్యులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రైతుభరోసా వెంటనే అందజేయాలని రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకట లక్ష్మి అధికారులు , ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి